## బహుమతి పొందిన చిట్టికథ

# పసి హృదయం

కె. జానకీదేవి

సాయంత్రం ఐదు గంటలకి శారద చదువుకోడానికి పుస్తకాలతో డాబా పైకి వెళ్లింది. చదువు మధ్యలో ఆమె దృష్టి ఎదురింటిపై పడింది. వరండాలో తాతగారు కనిపించలేదు. ఎదురింటి తాతగారు రోజూ సాయంత్రం వరండాలో పడక కుర్చీలో కూర్చొని చదువుకుంటారు. ఆ రోజు కనిపించక పోయేసరికి శారదలో ఆలోచనలు మెదిలాయి.

"తాతగారికి రాత్రి వంట పూర్తవలేదేమో! కాదు, కాదు. రాత్రికి వంట అక్కర్లేదు. మా తాతగారు రాత్రి భోజనం చేయరు కదా!"

"తాతగారి వంట్లో బాగులేదేమో! పాపం, వంట్లో బాగులేకపోతే మందెవరిస్తారు? భోజనం ఎవరు పెట్తారు? మా తాతగారికి జర్వం వస్తే డాడీ డాక్టరుని తీసుకొచ్చారు, మమ్మీ వేళకి మందులు, కాఫీ యిచ్చి ఆయన సంగతి కనిపెట్టేది. నేను స్కూలు నుంచి వచ్చి తాతగారి కాళ్లు పట్టేదాన్ని. మరి ఈ తాతగారికి ఎవరూ లేరు కదా!"

ఏ సంగతీ తెలుసుకోడానికి డాబా దిగి, తాతగారింట్లోకి వెళ్లింది. తలుపుకి తాళం వేసివుంది. ప్రక్కింటి ఆంటీని తాతగారి గురించి అడిగింది. ఉదయం బయటికి వెళ్లి, యింతవరకూ రాలేదని తెలుసుకోగానే శారద కాళ్లు వణికాయి. తాతగారికి ఏదైనా ఏక్సిడెంటు జరిగిందా? ఛీ, పాడు ట్రాఫిక్ అనుకుంటూ ప్రక్కవీధిలో డాక్టర్ సుబ్రహ్మణ్యంగారింటికి వెళ్లింది. అతను కె.జె.హాస్పిటల్ సూపరింటెండెంటు.

సుబ్రహ్మణ్యంగారికి శారద అమితమైన వాత్సల్యం. కంగారుగా ఉన్న శారదని సముదాయించి సంగతి తెలుసుకొన్నారు. శారదతో కారులో కె.జి.హెచ్.కి వెళ్లారు. అక్కడ వాకబుచేసి వార్డులోకి వెళ్లారు.

"అయ్యో పాపం, తాతగారూ!" అంటూ శారద ఏడుపు మొదలెట్టింది. పేషెంటుని జాగ్రత్తగా గమనించమని, ఎంతఖరీదైన మందులైనా వాడమని, రాత్రంతా అప్రమత్తతతో కనిపెట్టుకుని ఉండమని డాక్టర్లతోను, నర్సులతోను చెప్పి సుబ్రహ్మణ్యంగారు శారదని యింటి దగ్గర దిగబెట్టారు.

రాత్రి తాతగారికి తెలివి వచ్చింది. డాక్టర్లు మందులివ్వబోతే, "నన్ను చావనివ్వండి. నేనెందుకు జీవించాలి? కొడుకు అమెరికా వెళ్లిపోయి పది సంవత్సరాల నుంచీ యిటువైపు చూడనేనా చూడలేదు. కూతురికి యిల్లు అమ్మి డబ్బివ్వలేదని కోపం. నాకు డబ్బై సంవత్సరాలు నిండాయి. ఈ ఒంటరి బ్రతుకువల్ల ప్రయోజనమేమిటి? భగవంతుడు ప్రసాదించిన వరమే యీ ఏక్సిడెంట్. నన్ను ప్రశాంతంగా చావనివ్వండి" బలవంతంగా ఇంజక్షన్లు యిచ్చి, నర్సులకి అప్పచెప్పి, డాక్టర్లు వెళ్లిపోయారు.

శారద మరునటిరోజు స్కూలుకి వెళ్తూ త్రోవలో కె.జి.హెచ్.కి వెళ్లి వార్డులో ఉన్న నర్సుకి తన చేతులతో తయారుచేసిన పూలబుకే, ఒక ఏపిల్ యిచ్చి తాతగారికివ్వమంది.

తాతగారు వాటిని చూసి విస్తుపోయారు. తన గురించి పట్టించుకొనే వాళ్లు ఉన్నారా అని ఆశ్చర్యపోయారు. ఆ పిల్ల గురించి వివరాలు నర్సు చెప్పలేకపోయింది. ఆ పిల్ల ఎవరా అని ఆలోచించసాగారు. తన మనవరాలు యీపాటికి ఎదిగి నర్సు చెప్పిన పిల్లంత అయిఉండవచ్చు అనుకున్నారు.

తాతగారికి ఏనుగు కున్నంత బలం వచ్చింది. జీవించాలని, జీవించి తనకోసమై తపన పడుతున్న ఆ పసిపాపని హృదయానికి హత్తుకోవాలనిపించింది. ఈ భావనే దివ్యౌషధంగా పనిచేసింది. నాలుగు రోజులలో స్వస్థతచేకూరింది. తాతగారిని ఆసుపత్రి నుండి విడుదలచేసిన రోజున తాతగారి చెయ్యి పట్టుకొని తీసుకెళ్తున్న శారదని చూశారు సుబ్రహ్మణ్యంగారు.

శారదలో కనిపించే మమత, మమకారాలు అందరిలోనూ చోటుచేసుకుంటే ఆస్పత్రులపై వత్తిడి తగ్గేదికదా అనుకుంటూ శారదని మనసారా ఆశీర్వదించారు. ★

